## రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే


సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**శంషాబాద్ రూరల్:** మండలంలోని చిన్నగోల్కొండలో సోమవారం సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. రూ. 28 లక్షల సొంత నిధులతో పనులు చేపట్టిన స్థానిక సర్పంచు గుర్రం పద్మావతి అనంతరెడ్డిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. గ్రామాల అభివృద్ధిలో స్థానికుల సహకారం తోడైతే ప్రజలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ, వైఎస్ ఎంపీపీ నీలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి కాలనీలో రోడ్లు నిర్మిస్తాం


సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు

**మణికొండ:** నార్సింగి మున్సిపాలిటీ 6వ వార్డులోని, అవసరమైన అన్ని కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టి సుందరంగా తీర్చిదిద్దుతామని కౌన్సిలర్ పి. శ్రీకాంత్‌రావు అన్నారు. రూ. 32లక్షల నిధులతో బృందావన్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అనేక కాలనీలు కొత్తగా వస్తుండటంతో అదే స్థాయిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. తన వార్డు పరిధిలోని ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వేగవంతంగా దరఖాస్తుల కంప్యూటరీకరణ


కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

**బండ్లగూడ:** ప్రజల దరఖాస్తులను కంప్యూటరీకరణ చేస్తు డాటా ఎంట్రీని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. శశాంక అన్నారు. సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చేపడుతున్న కంప్యూటరీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మయకంగా చేపట్టిన ప్రజా పాలన ఆరు గ్యారెంటీల పథకాలకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న డాటాను ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా కంప్యూటరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేసన్ కమిషనర్ శరత్‌చంద్ర, మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, సూపర్‌వైజర్ ఆఫీసర్స్, వార్డు ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వెలిసిన విగ్రహాలకు పూజలు


విగ్రహానికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**మైలార్‌దేవ్‌పల్లి:** ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు అందిస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో కొన్ని రోజుల క్రితం నర్సాబాయి కుంటలో లింగం, నంది విగ్రహాలు బయటపడటంతో స్థానిక ప్రజలు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భూమిలో వెలసిన విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలని స్థానికులను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి దేవాలయానికి స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు టి ప్రేమ్‌గౌడ్ .రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన పద్మశాలి సంఘం



**శంషాబాద్:** పట్టణంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పద్మశాలి కమ్యూనిటీ హాలు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని శంషాబాద్ మండల పద్మశాలి సంఘం నేతలు కోరారు. ఈమేరకు సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను ఆయన నివాస గృహంలో కలిశారు. గతంలో పట్టణంలో పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణికి శంకుస్థాపన చేసిన, పనులు ఇంకా పూర్తి కాలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నాల్గోసారి విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన విజయానికి పద్మశాలి సంఘం నేతలు సంపూర్ణంగా సహకరిస్తున్నారని అన్నారు. నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిపాటి పాండు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు డి. వెంకటేష్‌గౌడ్ , పద్మశాలి సంఘం నేతలు వర్కల శ్రీరాములు, బొడ్డు మనోహర్, పుట్ట వీరేశం, కాశిగారి అంజనేయులు, వెంకటేష్, కృష్ణ, సత్యం, వెంకటేశం, వెంకటేష్, రాజు, ప్రభు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్
## మేళాకు విశేష స్పందన

**బహదూర్‌పురా:** పాతబస్తీ తాడ్‌బన్‌లోని ప్రభుత్వ ఓల్డ్ సిటీ ఐటీఐలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ (పీఎంఎన్ఏఎం) మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాలో 16 ప్రముఖ కంపెనీలలో 947 మంది అప్రెంటిషిప్ కోసం 844 మంది విద్యార్థులు హాజరయ్యారు. మిధాని, టీఎస్ఆర్టీసీ, వెమ్ టెక్నాలజీ 224 మంది అభ్యర్థులను నేరుగా అప్రెంటిషిప్ కోసం ఎంపిక చేసుకున్నారు.

# ఆత్మవిశ్వాసానికి క్రీడలు దోహదం


కుస్తీ పోటీల్లో గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు



**అత్తాపూర్:** కుస్తీ చాంపియన్‌షిప్ పోటీల్లో పహిల్వాన్ ప్రకాశ్ సింగ్ బంగారు పతకాన్ని సాధించగా... ఎం. శ్రావణి టైటిల్‌ను గెలుచుకొని అందరి ప్రశంసలు అందుకుంది. గత నాలుగు రోజులుగా అత్తాపూర్ రాంబాగ్ మైదానంలో జరిగిన తెలంగాణ అంతరాష్ట్ర సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి 5వ కుస్తీ పోటీలను పహిల్వాన్ రాజు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 300 మంది రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు నారగూడెం మల్లారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందించడానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు స్వీయ రక్షణ కోసం ఏదో ఒక క్రీడల్లో రాణించాల్సిన అవసరముందన్నారు. తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజం గర్వించే విధంగా జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాల్సిన అవసరం నేటి యువతరంపై ఉందన్నారు. ఈ కుస్తీ పోటీల్లో 15 కేటగిరీల్లో 49 మంది విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. కొమురయ్య, అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, పహిల్వాన్ అర్జున్ సింగ్, సంతోష్, సదానంద్, అడ్వొకేట్ ప్రమోద్, విజయ్, వెంకటేశ్, మణికొండ మున్సిపల్ చైర్మన్, రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ ముదిరాజ్, రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ పై శిక్షణ


డ్రోన్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న సాంకేతిక నిపుణులు

**ఏజీవర్సిటీ:** శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో పవన్ ఏవియేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ, వాటి ఉపయెగాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమాని విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఉద్యాన విద్యార్థులు వ్యవసాయ రంగంలో వచ్చే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయ కూలీల కొరత అధికంగా ఉందని దానికి అనుగుణంగా రైతులు ఉద్యాన, వ్యవసాయ పంటలలో యాంత్రీకరణ ద్వారా ఆధునిక పద్ధతులను అనుసరించాలని దీని వలన కూలీల కొరతను అధికమించవచ్చని వివరించారు. అదే విధంగా తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడులతో అధిక లాభాన్ని సాధించవచ్చని తెలిపారు. ముఖ్యంగా యువత డ్రోన్ టెక్నాలజీతో స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు. అనంతరం సంస్థ ఉద్యాన, వ్యవసాయ పంటలకు అవసరమైన డ్రోన్ సాంకేతికతపై విద్యార్థులకు మెలకువలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ స్టూడెంట్ డాక్టర్ విజయ్, అసోసియెట్ డీన్ ప్రశాంత, ఎన్ఎస్ఎస్ ప్రొగామ్ అధికారి ఆర్. సంతోషిని, డాక్టర్ కళాధర్ బాబు, అశ్వన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, ఆంజనేయులు, సూర్యప్రశాంత్, రజిత ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయు నాయకులు

**మణికొండ:** కేంద్ర ప్రభుత్వం భారత న్యాయ సహిత (బీఎన్ఎస్) చట్టంలోని సెక్షన్ 106, 1/2 చట్టం రద్దు చేయాలని మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల ఆటో ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్‌తో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వస్తున్న బీఎన్ఎస్ చట్టం ప్రకారం ఎదుటి వారు వచ్చి ప్రమాదం చేసి చనిపోతే డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7లక్షల జరిమానా చెల్లించాలని పొందుపర్చారన్నారు. ఇలాంటి చట్టాల ద్వారా దేశవ్యాప్తంగా డ్రైవర్‌లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, చట్టాన్ని ఇరువర్గాలలో ఎవరిది తప్పు ఉంటే వారికే శిక్ష వర్తించేలా మార్పు చేయాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో డ్రైవర్లకు తీవ్ర నష్టం కలుగుతుందని, వారికి నెలకు రూ.15వేల రుణబృతి, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, దాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు శ్రీకాంత్, సతీష్, సాయి, నాగేందర్, ఇంత్యాస్, రాము, సుధాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

**రాజేంద్రనగర్:** పురిటి నొప్పులతో బాధ పడుతున్న మహిళ అంబులెన్స్‌లో బాబుకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెలితే..బండ్లగూడ ప్రాంతానికి చెందిన నీతుకుమారి సోమవారం పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108కి ఫోన్ చేయగా గోల్కొండ ధవాఖానకు చరలించే క్రమంలో మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో సిబ్బంది రోడ్డు ప్రక్కన అంబులెన్స్ ఆపి ప్రసవం చేశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ రాముడు తెలిపారు.

## విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలో ఇన్‌స్పెక్టర్

**అత్తాపూర్:** రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని ఢిల్లీ బచ్‌పన్ స్కూల్‌లో సోమవారం సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి పాల్గొని 48 విభాగాల్లో విద్యార్థినీ, విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిట్లను ఆయన అడిగి తెలుసుకొని వారిని ప్రోత్సాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే ఎంతో చక్కగా విజ్ఞానం మీద పట్టు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఇన్‌స్పెక్టర్ ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో కష్టపడి ప్రదర్శనలో ఎగ్జిబిట్లను ఏర్పాటు చేయడం ఎంతో గర్వంగా ఉందని స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరి, రష్మి జోషి, మహేశ్వరి, పూజ, సుమన్, కల్యాణి, సునీతా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఉపాధ్యాయులు

### నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**రాజేంద్రనగర్:** విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. జనప్రియ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఏజీ కాలనీ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, జనప్రియ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

### మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు


మంత్రి సీతక్కను కలిసిన ఉద్యోగుల సంఘం నాయకులు

**రాజేంద్రనగర్:** రాష్ట్ర మంత్రి సీతక్కను సోమవారం రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు కలిసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల సంఘం నాయకుడు రాజు ఆధ్వర్యంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసినట్లు వెల్లడించారు.

### అయోధ్య అక్షింతల పంపిణీ


శంషాబాద్‌లో అయోధ్య శ్రీరామ అక్షింతల వితరణ

**శంషాబాద్:** శ్రీ రామ నామ భజనలతో వైభవంగా అయోధ్య శ్రీ రామ అక్షింతల వితరణ కార్యక్రమాన్ని పట్టణంలోని కాపుగడ్డ, యాదవబస్తీ, బ్రాహ్మణవాడి తదితర బస్తీల్లో నిర్వహించారు. అయోధ్య అక్షింతల వితరణ కార్యక్రమానికి మహిళలు హారతులు ఇచ్చి స్వీకరించారు. కార్యక్రమంలో చక్రధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు చేపట్టిన మాదాపూర్ నూతన డీసీపీ



**గచ్చిబౌలి:** సైబరాబాద్ కమిషనరేట్‌లోని మాదాపూర్ జోన్ నూతన డీసీపీగా డాక్టర్ వినీత్ బాధ్యతలు చేపట్టారు. గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఆయన సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాదాపూర్‌జోన్ పరిధిలో పనిచేసే ఏడీసీపీ నంద్యాల నర్సింహ్మరెడ్డి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారంతా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

### 10న సంక్రాంతి ముగ్గుల పోటీలు

**జియాగూడ:** ఈనెల 10న కాంగ్రెస్ పార్టీ జియాగూడ డివిజన్ సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా నాయకురాలు నర్మద, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఆశా చౌగ్లేలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జియాగూడలోని 2బిహెచ్‌కే ఎంసీహెచ్ గ్రౌండ్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు, పార్టీ ఖైరతాబాద్ ఇన్‌చార్జ్ పి.విజయరెడ్డి చేతుల మీదుగా అందజేస్తారని పేర్కొన్నారు.

## రేపటి నుంచి క్రికెట్ పోటీలు

**రాజేంద్రనగర్:** స్వామి వివేకనంద 161వ జయంతి, అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం మైదానంలో హై స్కూల్ విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు యువ మోర్చా ఉపాధ్యక్షులు టి. హేమంత్ రాజ్, కార్యదర్శి జి. అరుణ్ కుమార్‌లు తెలిపారు. జనవరి 10వ తేదీన ఉదయం 10 గంటలకు డ్రాస్ తీస్తామన్నారు. 11వ తేదీన సాయంత్రం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మరిన్ని వివరాలకు అరుణ్ కుమార్ (6301492380)లో సంప్రదించాలన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**శంషాబాద్ రూరల్:** మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మీ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

## మహిళలకు ఉచిత శిక్షణ

**శంషాబాద్ రూరల్:** మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో స్వయం ఉపాధి కోసం మహిళలకు పలు అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి నిర్వహించే తరగతుల్లో పచ్చళ్లు, వివిధ రకాల కారం పొడిలు, తృణ ధాన్యాలతో స్నాక్స్ తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులై 19 నుంచి 45 ఏళ్ల వయస్సు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10 రోజుల శిక్షణ సమయం ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఉప కమిషనర్ రవి కుమార్

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లాన్ ఎలక్ట్రికల్ ట్యాక్స్ సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయా సమస్యలపై అధికారులు, సిబ్బంది సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రజలు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ ఫిర్యాదులను అందించాలని ఈ సందర్భంగా ఉప కమిషనర్ కోరారు.

## అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం


కళాకారులను సన్మానిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్

**శంషాబాద్ రూరల్:** మండలంలోని పెద్దషాపూర్‌లో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాణ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. ఆదివారం రాత్రి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రదర్శించిన ఈ నాటకాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. అంబేడ్కర్ జీవితం అందరికి ఆదర్శమని స్థానిక సర్పంచు చెక్కల చంద్రశేఖర్ అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామెల్, జిల్లా నాయకుడు ఎర్ర వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, ఎస్ఐ భాస్కర్, ఉపసర్పంచులు మల్లమ్మ, సురేష్‌నాయక్, వార్డు సభ్యులు మానయ్య, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్సిటీల భూములు హైకోర్టుకు కేటాయించొద్దు


వీసీ భవనం ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

**ఏజీవర్సిటీ:** ప్రొ.జయశంకర్ వ్యవసాయ వర్సిటీ, కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించొద్దని, ప్రభుత్వం జారీ చేసిన జీవో 55ను వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ చాంబర్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాలయ ఝాన్సీ మాట్లాడుతూ..రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఉన్న అతి పెద్దది వ్యవసాయ వర్సిటీ అని ప్రస్తుతం ఈ వర్సిటీ దేశంలోనే అగ్రగామిగా ఉందని రైతులకు నష్టాలు జరగకుండా పండించే ప్రతి పంటలకు లాభం వచ్చే విధంగా నూతన వంగడాలను విత్తనాల పరిశోధనలు, అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాంటి వర్సిటీలో 35 ఏళ్లుగా మెడిసిన్ ప్లాంట్స్, వెజిటేబుల్స్ సీడ్స్ అటవీ ఉత్పత్తులపై ఎన్నో పరిశోధనలు జరిగి తెలంగాణ రాష్ట్రంలో రైతాంగాన్ని పటిష్టం చేయడానికి ఎంతో మంది శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారని అలాంటి అగ్రో బయోడైవర్సిటీ కొనసాగుతున్న పార్కులో రాష్ట్ర హైకోర్టుకు సంబంధించిన భవనాలను కట్టడానికి ప్రభుత్వం ముందుకు రావడం దారుణమన్నారు. వర్సిటీ భూములు రక్షించాల్సిన వీసీ, రిజిస్ట్రార్ భూమి ఇవ్వడానికి వత్తాసు పలకడం సిగ్గుచేటని ఇప్పటికైనా ప్రభుత్వం మూర్ఖత్వపు వైఖరి వీడి యూనివర్సిటీ భూమి పరిరక్షణకు పాటు పడాలన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. శ్రీనాథ్, మనిషా, పృథ్వీ రాజ్, సూర్యప్రకాశ్, మహేష్, రాజు, సాయిరాం, హరిప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందకిశోర్ గుప్తా

**శంషాబాద్:** కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయించిన ఉత్తర్వులను రాష్ట్ర సర్కారు రద్దు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిలు డిమండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వర్సిటీ భూములు ఇతర రంగాలకు కేటాయిస్తే వ్యవసాయ, ఉద్యావన రంగాల్లో పరిశోధనలు ఆగిపోతాయని అన్నారు. ప్రేమావతిపేట, బుద్వేల్‌కు చెదిన రైతులు తమ సొంత భూములను అప్పట్లో వర్సిటీకి అందజేశారన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికే అనేక సంస్థలకు స్థలాలు కేటాయించడంతో వర్సిటీ భూము చాలా వరకు తగ్గిపోయిందన్నారు. హైకోర్టుకు ప్రత్యామ్నయంగా శంషాబాద్‌లో ఉన్న హెచ్ఎండీఏకు చెందిన సర్వేనంబరు 725లో వంద ఎకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి సరైన నిర్ణయం తీసుకోకపోతే బీజేపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందన్నారు. పట్టణ అధ్యక్షుడు దేవేందర్, విజయభాస్కర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.